# మా వీధి

శ్రీమతి సమయమంత్రి వసంతాదేవిగారు

అమ్మయ్య! మా వీధి వచ్చింది. అరే! ఇది మా వీధే? ఇదనే జ్ఞాపకం. కాదేమో ఒకవేళ. అవునా? కాదా? అనే సందేహంతో ఇదమిద్ధమని తేల్చలేకుండా వున్నాను. మునుపు, ఈ స్థలంలో జమీందారుగారి పశువుల దివాణం వుండాలి. అది ఏదీ? ఇప్పుడిక్కడ ఈ పెంకుటిల్లు వుందేమిటి? మునుపు, ఈ వీధిలో అన్నీ పూరిగుడిశలూ, పాకలూ ఉండేవి. జమీందారుగారి పశువుల దివాణం ఒక్కటే పెంకుటిల్లు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంతట్లోకి ఆయింట్లోంచి "వందేమాతరం" వినిపించింది. తలపైకెత్తి చూశాను. అప్పుడే ఎండవచ్చేసింది. మా యిల్లు ఎక్కడో నాకు తెలియటంలేదు. మా అమ్మ ఎక్కడ వుంటోందో, గబగబా వీధిచివరికి నడిచాను. ఎక్కడా ఒక్క గుడిశలేదు. ఆశ్చర్యంగావుంది. నాకు, అటూ ఇటూ కూడా ఒక్కటే గోడ. అయితే మా యిల్లేదీ? మా యిల్లూ, పొలం వేలం వేశారేమో. మా అమ్మ ఒకత్తెమరి, ముసిలిది. పన్ను కట్టలేదేమో? పోనీ అంటే, ఎవ్వరి గుడిశాలేదు. ఎవరినైనా అడుగుదామంటే ఒక్కపిట్టకూడా లేదు ఆ వీధిలో. నిరాశతో వెనుకకు నడిచాను.

మళ్ళీ ఆ మొదటి పెంకుటింటి దగ్గరకి వచ్చాను. ఇంతట్లోకి ఆ యింట్లో ఎవరో కుర్చీలో కూర్చుని ఒక ఖద్దరు బాబు ఏవో కాగితాలు చూసుకొంటున్నాడు. "ఏమండీ ఈ వీధి పేరేమిటండీ" అని అడిగాను. "నేతాజీ వీధండీ! ఆ మాత్రం తెలియదూ మీకు?" అన్నాడు. ఇదేమిట్రాబాబూ! జమిందారుగారి పశువుల దివాణం వీధనేవారు కదా అనుకొన్నాను. ఇంతట్లోకీ ఆయన ఏమిటండీ! "అల్లాడిల్ల బోయి చూస్తారు?" అన్నాడు. "ఓహో! అల్లాగా; నేనీవూరికి క్రొత్తవాడ్నిలెండి" అన్నాను.

"అయ్యో అల్లాగా! మీరీవీధికి చెందినవారు కారనుకొంటాను," అని క్షమాపణాపూర్వకంగా అని "కాసిని పాలూ, ఆవకాయ అన్నం తేనాండి!" అన్నాడు.

"పొద్దుటే అన్నం ఏమిటండి?" నిర్మొఖమాటుగాం అనేశాను. అవును హాయిగా కాఫీ, టిఫిన్ తీసుకోక ఇదేమిటి?

"అదేమిటండీ, మీకు నిబంధనలు తెలియవా ఏమిటి? చూడండి," అంటూ ఆయన ఒక దళసరి కాయితాల పుస్తకం యిచ్చాడు.

"ఇదేమిటండీ కాయితాలు ఇంత దళసరిగావున్నాయి?" అన్నాను.

"అబ్బే! ఏ వీధికి కావలసిన సరుకులు, వారే తయారుచేసుకోవాలి. కాబట్టి ఈ కాయితాలు మేంతయారుచేసినవే" అన్నాడు ఆయన.

చూశాను ఆ పుస్తకంలోకి. మొదటిది: ప్రొద్దుటే 5 గంటలకు అందరూ లేవాలి. రెండవది: కాలకృత్యాలు తీర్చుకుని అందరూ ప్రార్థనకు హాజరు కావాలి. మూడవది: ఆరు గంటలనుంచి ఏడున్నర వరకు అందరూ చరఖా వడికాలి. నాల్గవది అందరూ చద్దిఅన్నంతినాలి. ఆ తరువాత ఎవరి పనులలోకివారు ప్రవేశించాలి. 12 గం॥ వరకు పనిచేసి భోజనమునకు హాజరవాలి. మరల 2 గం॥ వరకూ ఎవరిపనిలోకి వారు ప్రవేశించాలి. 4 నుంచి 5 వరకూ ప్రసంగాలను, వినడం, 5 నుంచి 6 వరకు చరఖావడకడం, 6 నుంచి 7 వరకూ, పుస్తక భాండాగారంలో వుండి, 7 గంటలకు భోజనం చేసి, 8 గంటలకు పడక.

చూశాను! చివరి వరకూ చదివాను. కొయ్యబారినంత పని అయింది. అయితే సహజంగా కొన్ని ధర్మసందేహాలు వచ్చాయి.

"అయితే అందరూ, ఈ ఇంట్లోనే వుంటారా?" అని అడిగాను.

"ఆ వుంటారు. ప్రతీవీధికీ ఇటువంటి దొకటుంటూ వుంటుంది. ఆ వీధి వాళ్ళందరూ, అందులోనే వుంటారు.

"అయితే, మునుపు ఇక్కడ జమీందారుగారి పశువుల దివాణం వుండాలికదండి" అని చివరికి అడిగేశాను, వుండబట్ట లేక.

"జమీందారూలేదు! పశువుల దివాణం లేదు! ఆ కాలం వెళ్ళిపోయింది" అన్నాడు వెనుకటి దేదో జ్ఞాపకం చేసుకొంటున్నట్లు.

"అయితే, జమిందారు ఏమైనట్లు?" వెంటనే నాలుక కొరుక్కున్నాను. జమీందారు ఏమైపో లేదు. బిరుదువుండదు గాని.

"అయ్యో మీకు తెలియదూ? జమీందారీలు తీసేసారని?" ఏదో పేపర్లో చదివానుగాని, ఇంత మారిపోతుందనుకోలేదు. ఈ నాలుగు ఏళ్ళల్లోనూ, మావూరు ఎంత మారిపోయిందో?

"అయ్యో నామతి మండిపోనూ. మీరే వూర్నుంచి వచ్చారు? కాంగ్రెస్ వాళ్ళేనా? ఇక్కడే వుంటారా?"

ఇదంతావింటూంటే నాకు కడుపులో గాభరా ఎత్తింది. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవాలనిపించింది.

"ముందు నేనడిగిన దానికి సమాధానం చెప్పండి. మీరు హిందువులేనా? కాంగ్రెసేనా?"

"అవునండీ నేను ఆంధ్రుడిని"

"అయితే మీ పేరు? ఎక్కడనుంచి వచ్చారు?"

"నా పేరు ఎస్. ఎన్. రాయణ్ అండి"

"అయితే మీరు పేరు మార్చుకోవాలి"

"నేనా? పేరు మార్చుకోవాలా? ఇదేమిటండీ? మనిషిని కూడా మారమంటారా?

"వీల్లేదండీ. ఏ రాముడనో, కృష్ణుడనో, గాంధీ అనో, నెహ్రూ అనో పెట్టుకోవాలి. ఆ ఫేషనబుల్ ఇంగ్లీషు పేర్లు పనికిరావండి." అన్నాడు.

ఇంతవరకూ ఆయన మాట్లాడిన సంభాషణలో అదొక్కటే ఇంగ్లీషుమాట.

"అసలు నా పేరు నారాయణ లెండి."

"అయితే ఇకనేం. మీాకేం పని వచ్చండీ?"

"అంటే"

"వడ్రంగమా, పొలము దున్నడమా, కుమ్మరి పనీ, దర్జీ పని"—"అబ్బే నాకిటువంటి వేమీ రావండీ" అన్నాను. ఈయనెవడో అడవి మనిషి అనుకుంటూను. నేను ఎంతో కష్టపడి సెలవులకైనా యింటికి రాకుండా చదివి ఎల్లాగో అత్తెసరు మార్కుతో ప్యాసయి, బి. ఏ., కు సీటు రాక పడిగాపులుపడి, నాహారిజన్ క్వాలిఫికేషన్‌తో సీటు తెప్పించుకొని, దానితో నేనెల్లాగో బి. ఏ., మనిషిననిపించుకుని వస్తే, ఈయన నన్నిల్లా నీచం చేస్తున్నందుకు చాలకోపం వచ్చింది.

"అయితే ఏదోవకటి నేర్చుకు తీరాలి."

"నిర్బంధమా?''

"ఆ అటువంటిదే నిబంధనల్లోనూ లేదు! ఎవరి పనిలో కావివి. ఆపనులు మనవే. స్వయంపరిపాలన వచ్చేసిందికదండీ మరి. అవునుగాని, ముందాబట్టలు విడిచి ఇవికట్టుకోండ"ని, దుక్కల్లాంటి ఖద్దరుబట్టలు ఇచ్చాడు-

కట్టుకోకపోతే, కొడతాడనిపించింది. కట్టుకొన్నాను.

"ఇకలోపలికి నడవండి. మీ నంబరు 51. జ్ఞాపకం పెట్టుకోండి.''

లోపలికి అడుగు పెట్టేసరికి గడపతగిలి బోర్లా పడ్డాను.

"అమ్మో" అని అరిచి అదిరి పడిలేచాను. చూచేసరికి హారిజన్ హాస్టల్లో, నా రూములో పక్క మీద వున్నాను.

"ఆదేమిట్రా! అల్లా అరిచావు? లేలే! రైలుకు టైము ఇంక ఆట్టే లేదు. అన్నీ సర్దేసు కున్నారా?" అంటున్నాడు మా సహవాసి.

"అమ్మయ్య! ఇది కలే కదా!" అని నిట్టూర్పు విడిచాను.

★